# బిచ్చపు గింజలు

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

ప్రశాంతంగా చీకట్లను దూసుకు పోతూంది రైలుబండి. వేసవికాలపు రాత్రుళ్లు, విపరీతంగా ఉక్క పోస్తూంది. ఖాయిపూరునుండి వాల్తేరు మూడవ క్లాసులో ప్రయాణం చేస్తున్నాను. నిజం చెబుతున్నాను, మూడవ క్లాసులోనే ప్రయాణం చేస్తున్నాను. కర్మం చాలక టిక్కెట్టు దొరక్కో, లేకపోతే జాగాలేకో, ఎవరైనా రెండో క్లాసులోగాని ప్రయాణం చేశాడా, యింటి కొచ్చి మాటల సందర్భంలో ఏదో విధంగా నలుగురికీ చెప్పేస్తాడు తను సెకండ్ క్లాసులో ప్రయాణం చేసినట్టు. కాని మూడవ తరగతిలో ప్రయాణం చేస్తే మట్టుకు ఆ వూసే ఎత్తడు. ఎవరైనా అడిగితే, అవసరమైతే ఇంటరు వరకే అబద్ధమాడుతాడు. సరేలెండి, ఆ విషయ మిప్పుడెందుకు రామాయణంలో పిడకల వేటలాగ!

నే ప్రయాణం చేసిన మూడవ తరగతి పెట్టెలో ఎక్కువ జనం లేరు; నలుగురం వున్నాము. నా పక్క బెంచీ మీద పడుకున్న తెలుగాయనకు రైల్వేలో పని. గుమాస్తా అనుకుంటాను. లేకపోతే మూడవ తరగతి కర్మమేం? కాని కొసవరకూ దాబు సరిగానే మాట్లాడేడు. ఇంగ్లీషులో నే ప్రారంభించి తన నాగరికతను కాపాడుకున్నాడు.

"ఎక్కడికెళుతున్నారు?" అని ప్రశ్నించి మర్యాదగా ఒక సిగరెట్టు అందించాడు.

"వాల్తేరు-మీరు?"

"నేనూ అక్కడికే, ఎక్కడినుండి వస్తున్నారు?"

"ఢిల్లీ నుండి"

"ఓహో, అలాగా! ఏమిటి ఢిల్లీలో ఏం చేస్తున్నారు?"

"ఏదో ఉద్యోగం, కూటి కోసం."

"అంతే అనుకోండి. అయినా ఢిల్లీలో వున్నారు, అదృష్ట వంతులు" అన్నాడాయన. ఆ అదృష్ట మేమిటో బోధపడలేదు. ఉన్న వాళ్లందరూ కూడా అదృష్ట వంతులేనా అనే సమస్య కూడా వుంది అయినా మొత్తం మీద నా గౌరవం, ఢిల్లీ గౌరవం నిలబెట్టేడు.

"ఏమిటి ఢిల్లీ వింతలు!"

"ఏ మున్నాయి. పత్రికల్లో వచ్చేవే!"

"ఆహార సమస్య ఎలావుందక్కడ?"

"బాగానే వుంది."

"అంటే, పరిస్థితి బాగానే వుందనా మీ వుద్దేశం?"

"ఆ! అవును. మనపక్క ఎలావుంది?"

"చాలా ఘోరంగా వుందంటున్నారు. అంటూ వుంటే స్టేషను వచ్చి బండి ఆగింది. మంచినీళ్లకని బండి దిగి వెళ్లేడాయన.

ఆహార సమస్య! దీని గురించి పేపర్లు తెగ వ్రాస్తున్నాయి. నాయకులు, మంత్రులు యీ విషయమై ఉపన్యాసా లిస్తున్నారు. విధీ విరామం లేకుండా సమస్యా పరిష్కార సూచనలు! బీహారులో ఆకలిచావులు! మద్రాసులో కరువు! అమెరికా నుండి అన్నదానం! చైనానుండి బియ్యం! ఆహార మంత్రి గారి వనమహోత్సవాలు! మిస్సేమీల్ ఉద్యమం! అన్నానికి బదులు తెల్ల దుంపలు, మామిడి టెంకల భోజనం! ఇదీ వరస! అసలు కరువంటే ఏమిటి? తిండిలేక మనుషులు చచ్చిపోతారా? ఎలా నమ్మడం? కటిక దారిద్ర్యంలో నివసిస్తూన్న ప్రజలనేకమందున్నారు. కాని వారు ఎలాగో అలాగ, ఏ బలుసాకో తిని బతుకుతారుగాని చస్తారా? ఉత్తర ధృవంలో ధాన్యాదులు పండవు! అయితే అక్కడి వాళ్లు తిండికి లేక చచ్చిపోతున్నారా? మనిషికి బతకాలనే ఆశేవుంటే ఎలాగైనా బతికేస్తాడు. పరిస్థితులకు అలవాటు పడి సర్దుకుపోతాడు. ఇంతకు మునుపు కరువులు కోటకోలు ఎన్ని రాలేదు? ఎన్ని పోలేదు?

అంచేత ఆహార సమస్య అంటే ఏమిటి? దాని సమగ్ర స్వరూపమేమిటి? దాని కింత అట్టహాస మేమిటి? ఈ సర్వ సందేహం నా బుర్రలో ప్రవేశించింది. ఈ రెండు మూడేళ్లలో నాకీప్రశ్న తట్టేలేదు. ఏదో పేపర్లో చదవడం తప్ప దానిని గూర్చి అట్టే ఆలోచించ లేదు. ఇంత శోధించ లేదు! హోటల్లో డబ్బుపారేసి హాయిగా కడుపునిండా అన్నం తిన్నాను. అప్పుడప్పుడు ఒక పూట భోజనం మానీసే వాడిని; కాని ఆహారసమస్యా పరిష్కారార్థమై మాత్రం కాదు; అజీర్తి వల్లనే. కాబట్టి ఆ గొడవే లేదు. ఇప్పుడు ఏడెవడో అనవసరంగా లేవదీసి నా బుర్రంతా పాడు చేశాడు.

నా రైల్వే సోదరుడు ఎప్పుడో నాకు తెలీకుండా ముసుగు తన్ని పడుకున్నాడు. ఆహార సమస్యా చర్చకై ఆ తడ్ని లేపడం మంచిదా, కాదా, అని ఆలోచిస్తూంటే ఒక స్టేషనులో బండి ఆగింది. ఒక్కసారి జనం ఎలకలమందలా లోపల జొరబడ్డారు. బండికి పెంకులు లేవుగాని పెంకులెగిరి పోయేలా మాటలు! పిలుపులు! కేకలు! అబ్బబ్బ! వెధవగోల! దిక్కుమాలిన జాతర, చేపల సంతలా తయారయింది పెట్టె! మా రైల్వే సోదరుడు ముసుగుతీసి "ఏ స్టేషను?" అని అడిగాడు. పక్కనున్న ఆడది "కసింగా" అని జవాబు చెప్పింది.

"అంటే?"

"అంటే ఏటి? దాని పేరు కసింగా" అన్నాది ఆడది.

"ఏడిసినట్టుంది" అన్నాడు సోదరుడు. పెట్టెలో జనాన్ని చూసి విసుక్కున్నాడు. "ఈ వెధవ లందరినీ ఎందుకెక్కనిచ్చేవ్!" అన్నాడు నాతో, ఎవరూ ఎక్కకుండా చూడ్డానికి నన్ను కాపలా పెట్టినట్టు.

"వాళ్లు నన్నడిగి ఎక్కేరేమిటి? అంతా ఒకసారి లోపల జొరబడ్డారు"

"వెధవలు, ఇంక మనల్ని నిద్రపోనివ్వరు. మన సామాన్లు ఓ కంటితో కనిపెట్టి వుండండి. ఇందులో చాలమంది దొంగ వెధవలుంటారు," అన్నాడు అనుభవజ్ఞుడైన నా తోడి ప్రయాణీకుడు.

"ఎవరు వీళ్లంతా?" అని ప్రశ్నించాను.

"బియ్యం దొంగతనంగా పట్టుకుపోయి మన ప్రాంతంలో అమ్ముకునే వాళ్లు"

అంటూ మళ్లీ ముసుగు తన్నేడు సోదరుడు. వాడి సామాన్లు చూడ్డానికి నన్నిలాగా నియోగించాడాయన!

బండి నడుస్తూంది; కాని అల్లరి పూర్తిగా సద్దుకోలేదు. పెట్టె చిన్నది; జనం ఎక్కువ. అందులో అన్ని రకాల వాళ్లూ, అన్ని వయసులవాళ్లూ వున్నారు. ఆడ, మొగ, చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా అందరితో పెట్టె కిటకిట లాడుతూంది. అందులో ఆడవాళ్లూ, పిల్లలూ ఎక్కువ. ఓ అయిదారుగురు కుర్రాళ్లు కూడా వున్నారు. తలుపులు తీసి, కాళ్లు బయట పడేసి, నేల కూర్చుని సినీమా పాటలు పాడుతున్నారు. పెంకి వెధవలు! అయితే అక్కడ నాకొకటి ఆశ్చర్యం వేసింది. మధ్యవయస్కులైన ఆడవాళ్లకు కడుపులు ఎత్తుగా వున్నాయి; ముసలమ్మలకు నడుములు ఎత్తుగావున్నాయి. వాళ్లు వంగి గూనివాళ్లలా నడుస్తున్నారు. మొదట చూడగానే అర్థం కాలేదు. ఆడవాళ్లందరూ గర్భవతులుగా వుంటారా? ముసలమ్మలందరూ గూని వాళ్లా అని అనుమానం వచ్చింది. కాని త్వరలో నివృత్తి కలిగింది. అవి కడుపులు కావు; గూనులు కావు, బియ్యపు మూటలు! వారా మూటలు తమ శరీరాలకు కట్టుకోవడం వల్ల సుళువుగా అటూ ఇటూ కదలలేక పోతున్నారు. దొంగపని చేస్తున్నామనే చైతన్యం భయం ఎదురు వాళ్ల మొహాల్లో, నడకల్లో, కదలికల్లో కనిపిస్తూంది. నీడలా వెంటాడుతూన్న భయం, భయంవల్ల తొట్రుపాటు, ఆయాసం, పట్టుబడకుండా వుండాలనే తీవ్రం ప్రయత్నం, తప్పుకుపోగలమనే ఆశ, తప్పుకుపోవడంలో తమకు గల అనుభవ చైతన్యం వారిలో ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి. నలుగురూ నాలుగు మూలలా సర్దుకున్నారు. ఒక ఆడది నాకెదురుగా నేలను కూర్చుంది. కడుపుకు బియ్యంమూట కట్టుకోవడం వలన చంటి పిల్లకు పాలివ్వడానికి కొంచెం అవస్థపడుతూంది.

"ఎక్కడికెళుతున్నారు మీరంతా" అని అడిగాను ఆడదాన్ని.

"నలుగురూ నాలుగు చోట్ల దిగిపోతాం బాబయ్యా! రాయిగడావరకు కాపాడండి బాబూ! మీ పుణ్యముంటది." అన్నాది ఆడది.

"ఇక్కడ బియ్యం చవకా?"

"అవును బాబు, రూపాయికి నాలుగు శేర్లు!"

"నువ్వెన్ని శేర్లు పట్టుకొస్తున్నావు?"

"ఎన్ని తేగల్ను బాబయ్యా? రెండు రూపాయిల బియ్యం కొన్నాను, బాబూ!"

"వీటిని ఎన్ని రూపాయిల కమ్ముతావు?"

"లేదు బాబు, అమ్మడానికి కాదు. తిండానికి తెచ్చుకుంటాము."

"నిజంచెప్ప భరవాలేదు. నేనేం పోలీసువాడిని కాదు."

"మేము తినడాని కుంచుకుని మిగిల్నవి అద్దు రూపాయిసొప్పున అమ్మేస్తాం" అన్నాది. ఇంకా ఎక్కువ ధరకే అమ్ముతుంది. నిజం చెప్పకుండా వుందని సుళువుగా గ్రహించేను.

ఆడది తల దించుకుని పిల్లకి పాలిస్తూంది. వయసు నడివయస్సు. యవ్వనం సడలలేదు. కాయకష్టం చేసిన శరీరం; అందమైన కళ్లు! కాని సంస్కారం లేని జుట్టు, మాసిన, అక్కడక్కడ చిరిగిన బట్ట, అనాగరికస్వరూపంవల్ల తొలిచూపుకు అందంగా కనబడకపోవచ్చు. ఆడదానివేపు తదేక దీక్షగా చూసేను. ఆమె నిష్కల్మషమైన కళ్లల్లో, వికారహితమైన చూపుల్లో అజ్ఞానం, అమాయకత్వం, భయం, దైన్యం గోచరిస్తున్నాయి. ఈమే గాని యింత వున్నవాళ్ల యింట్లో పుట్టి వుంటే, ఇంతో అంతో చదువుకున్న. పరిశుభ్రంగా, చక్కగా గోరింకలా తయారయి



ఇంటరుక్లాసులోనో, రెండోక్లాసులోనో ప్రయాణంచేసివుండును. దీనిలాగ బియ్యం దొంగతనం చేసి, నేలమీద, బెంచికింద దూరి యిన్నిపాట్లుపడుతుందా? ఈ ఆడదానికీ ఆ ఆడదానికీ వ్యత్యాసం అవకాశాల్లో వుంది. దానికి అవకాశా లున్నాయి; దీనికి లేవు. ఇది చాల అన్యాయం! ఛీ! మళ్ళీ రాజకీయాల్లో పడుతున్నా నేమిటి? పెధవ, రాజకీయాలంటే నా కెంత తలనొప్పో, ఆలోచిస్తూ తిరిగి తిరిగి అందులోనే పడుతూవుంటాను. ఆడది తలదించుకుని కూర్చుని, నిద్రపడుతూన్న బిడ్డని జోకొడుతూంది. పాపం, ఆడదానిమీద నాకు సానుభూతి కలిగింది.

"నీకెంతమంది పిల్లలు?'' అని అడిగాను. కాని యీ, విషయం నా కనవసరమని పించింది వెంటనే. ఆడదాని మంచితనాన్ని అవకాశంగా చేసుకుని ఎక్కువ చనువు తీసుకున్నానేమో నని విచారించేను. లేకపోతే యింకో పెంకిమనిషైతే "నీకెందుకావూసు? నువ్వేం కన్నావా, పెంచేవా వాళ్ళని" అని ఎదురు తిరిగేది. అప్పుడు నా పరువు మర్యాద లేంకాను? ఈ ఆడది మంచిది కాబట్టి "ముగ్గురు బాబూ'' అన్నాది.

"నీ భర్త కేంపని?"

"ఏంపని బాబు. ఏం కలకటేరుపనా, తాసీల్దారు పనా? అడిగాలేటి? పొలంలో ఏదో కూలీ నాలీ సేత్తాడు."

"అయితే నీకీ బియ్యం వర్తకమెందుకు? నువ్వుకూడా కూలి చేసుకోరాదా?"

"ఎందుకు సెయ్యను బాబు. సెయ్యకొల్లక కూకుంటే గడుస్తాదా? వోరానికి రెండు మూడు రోజు లిలా వచ్చి బియ్యమెట్టుకుపోతాను. నాతిండి కుంచుకుని తక్కినవమ్మేస్తాను."

"ఏం, మీవూళ్లో బియ్యం ఏమీ దొరకవా?"

"మీకు తెలీదేటి బాబూ, సదివినోరు. కరువు బగ్గున మండిపోతూంది కదా! బియ్యపుగింజలు దొరుకుతాయి బాబు, దొరక్కపోవు. కాని బ్లేకులో కొనగలమా మాలాంటివోల్లం,"

"నువ్వు బ్లేకుమార్కెట్టులో బియ్యం కొనలేవు, కాని అమ్మగలవు. ఏం?" అని ఎత్తిపొడిచేను. మహా గట్టిగా కొట్టేను దెబ్బ. దీనికేం జవాబివ్వ గలదు? నా తెలివితేటలకి సంతోషించేను.

"మాకాడ బియ్యం లేనప్పుడు యింకోరి దగ్గర బ్లేకులో కొనుక్కోడం నేదా? అలాగే మా కున్నప్పుడు మే మమ్ముకుంటాం, అల్లు మాదగ్గ రొట్టుకెల్తారు.'' గట్టి జవాబే యిచ్చింది. ఫెడీమని లెంపకాయ కొట్టినట్టు జవాబిచ్చింది. ఎవరి కవకాశ ముంటే వాళ్లు యింకోరిని బాధిస్తే కాని నడవదు జీవితం. సాంఘికధర్మమంతా ఒక్క ముక్కలో చెప్పింది ఆడది, నాకు సిగ్గొచ్చేలా.

ఇంతల్లో పెట్టెలో కలవరం బయలుదేరింది. మళ్లా అక్కడివాళ్ళు నాలుగు మూలలా హడావిడిగా సర్దుకుంటున్నారు. కొందరు మరుగుదొడ్లలోకీ, కొందరు బెంచీలకిందకీ దూరేరు. కొందరు పక్కపెట్టిలోకి పరుగెట్టేరు. ఆడది చటుక్కున బెంచీకింద దూరి పక్కలో బిడ్డను పెట్టుకుని పడుకుంది. కాళ్ళు రెండూ కుక్కలా ముడుచుకుంది. కడుపుకి బియ్యపు మూట వుండడంవలన ఏమీ సదుపాయంగా లేదని నేను గ్రహించేను. ఈ అల్లరికే మా రైల్వే సోదరుడు లేచి కూర్చున్నాడు.

"ఏమిటే గొడవ'' అన్నాను. నాకేం అర్థంకాలేదు.

"ఎవడో రేషనింగువాడు చెకింగుకి వచ్చాడు కాబోలు బియ్యంమూటలు పట్టుకోడానికి'' అన్నాడు సోదరుడు. రేషనింగువాళ్ళు చాలమందిని దించేసేరు రెండునిముషాలూ పెట్టి మళ్ళీ చేపలబజారయింది వాళ్ళు వెళ్లేక ఆడది బయటికొచ్చి కూర్చుంది బెంచీకింద ఉక్కపోస్తోంది; ఎలా పడుకోగలదు?

"ఆహార సమస్యగురించి మీతో చర్చిద్దామనుకున్నాను మీరు పడున్నారు'' అన్నాను.

"ఎందుకొచ్చిన పని చెప్పండి. కావాలంటే యీ పేపరు చదవండి. ఆహారమంత్రిగారి వుపన్యాసం పడింది. ఆయన పరిస్థితిని పూర్తిగా విశదీకరించేరు. నిజమే కొంత కొరత వుందని ఆయనే వొప్పుకున్నారు. ఎందులో లేదు కొరత? మనకన్నీ కొరతే'' అని పేపరు నా మొహాన్న పారేశాడు.


"పేపర్లు చదివి, చదివి మొహం మొత్తింది. నన్ను చంపకండి. మరి యీ సమస్యకు పరిష్కార మేమిటి?''

"ఇటువంటి సమస్యాపరిష్కారానికి ప్రజల్లో నైతిక, ఆధ్యాత్మిక బలం అవసరం. లేకపోతే జరగదు. చూడండి యీ పెధవలు యీ బియ్యం బ్లాకుమార్కెట్టు చేస్తున్నంత కాలం కరువు పోదు.''

"కరువు పోతేగాని బ్లాకుమార్కెట్టు పోదు. ఎలాగ? పెళ్లికుదిరితేగాని పిచ్చి కుదరదు, పిచ్చికుదిరితేగాని పెళ్లికుదరదు."

"పోనిద్దురూ ఆ గొడవలన్నీ రాజకీయవేత్తలకుగాని మన కెందుకు. పది గంటలైంది. నేనింకా భోంచెయ్యలేదు. ఎందుకీ శుష్కవాదం తియ్యండి ఆటిఫిన్ కేరియర్. ఇద్దరం తిందాం,'' అన్నాడాయన. నేను వద్దన్నా బలవంతం చేశాడు. ఇద్దరం పూరీలు, మిఠాయి తిని కూజాలో మంచినీళ్ళు తాగి, ఫ్లాస్కులో పాలు సేవించి, జీర్రున తేన్చాము. సోదరుడు మళ్ళీ ముసుగు తన్నేడు వీడి నిద్ర మండిపోనూ. కుంభకర్ణుడిలా వున్నాడు!

అంతల్లో పెట్లోకి టిక్కెట్టు కలక్టరొచ్చాడు. వీళ్ళని చూసి గట్టిగా నాలుగు కేక లేశాడు. సినిమా పాటలు పాడుతూన్న



కుర్రవాళ్ళు వాడితో మాట్లాడుతున్నారు. కాని ఆడది మాత్రం నిర్భయంగా కూర్చుంది.

"నువ్వు టిక్కెట్టు కొన్నావా?" అని ప్రశ్నించాను.

"లేదు బాబు" అని మహా నిర్లక్ష్యంగా జవాబిచ్చింది.

"ఏం? ఎందుకు కొనలేదు?"

"వారానికి నాలుగు సార్లొస్తాను కదా, టికెట్టు కొనగలమా బాబూ, సచ్చిపోమా" అన్నాది అతి తేలిగ్గా.

"మరి వాళ్ళు పట్టుకోరా?"

"మామూళ్ళుంటాయి బాబు లేకపోతే సచ్చిపోం బాబూ. ఈయ నెవడో కొత్తోడిలా గున్నాడు. ఇంకా ఏటీ, తెలీదు. అందుకే ఆల్లతో తగువుబడుతున్నాడు"

"వాళ్ళెవరు?"

"మావోల్లే బాబు. మేమంతా డబ్బెత్తి ఆల్లకిస్తే ఆల్లే యిదంతా సరుదుబాటు సేస్తారు."

"మీరు లంచాలుకూడా యిస్తారన్నమాట."

"లేకపోతే ఎలా గాతాది' బాబూ. ఇందులో ఒక్కొక్కడు ఒక్కొక్కలా గుచ్చుకుంటాడు. సలీం బాబున్నాడే ఆయనికి జట్టుకి రెండు రూపాయిలిస్తే సాలు. సాయిబయితేనేం బాబు, దరమరాజు," అన్నాది ఆడది. నాకాశ్చర్యం వేసింది. లంచగొండి వుద్యోగులు ధర్మరాజులట. ఎంత అజ్ఞానం?

"అయితే యిందాకొచ్చిన రేపను వాళ్ళంటే ఎందుకంత భయపడ్డారు? వాళ్లకూడా లంచమిస్తే వూరుకుంటారుగా?"

"ఆల్లుచ్చుకోరు బాబు. ఆల్లుచ్చుకుంటేనా? ఓ ఇంక 'అడిగినారా!"

"ఏం? వాళ్లెందుకు పుచ్చుకోరు?"

"ఏటో బాబు, ఆల్లుచ్చుకోరు."

"వాళ్లు మీదగ్గర బియ్యం పట్టుకుని తీసుకుంటారా?"

"మొగాళ్లదగ్గరా, పిల్లలదగ్గరా లాక్కుంటారు బాబు. కాని ఆడోల్లదగ్గిర కష్టం. ఎంచేతంటారు? మేము బియ్యం నడుముకీ, కడుపుకీ కట్టేసుకుంటాం కదా? ఆల్లు మా బట్టలిప్పా లేరు, మాసేత యిప్పించా లేరు," అన్నాది తమ తెలివి తేటలకి గర్వపడుతూ. నాకు చాల ఆశ్చర్యమేసింది. ఢిల్లీలో విలాసాల వాతావరణంలో, సుఖజీవుల మధ్య నివసిస్తూన్న నాకు, జీవితమంటే శోనేరు కాదనీ, అది నిరవధికమైన మహా సముద్రమనీ ఏం తెలుసు? మేడల్లో నివసించే భోగజీవులను తప్ప, మేడల నీడల్లో బతికే బతుకులను నేనేం చూసేను? ఈనాడు యిక్కడ జీవితంలో ఒక కొత్త కోణాన్ని దర్శించాను. వీళ్లకి చదువు లేదు, ఆస్తి లేదు, ధనం లేదు, ఏమీ లేదు. వాళ్లెందుకు బతుకుతున్నారో వాళ్ళకి తెలీదు. బతకడంకోసం ఎంత శ్రమ, ఎన్నికష్టాలు, ఎన్ని అవమానాలు! వాళ్ళు అవమానాలకీ, హీనతకీ ఎంత అలవాటుపడ్డారు. పాపం! అందుకే అన్నాడు కవి, 'అంతేలే పేదల బతుకులు తిరిపెమునకు పిడికెడు మెతుకులు,' అని. నా అజ్ఞానానికి నాలో నేను సిగ్గుపడ్డాను.

మళ్ళి పెట్టిలో జనం గోలచేస్తున్నారు. వాళ్లంతా టికెట్టు కలక్టరుచుట్టూ మూగేరు. టిక్కెట్టుకలక్టరు వాళ్లతో దెబ్బలాడుతున్నాడు. గట్టిగా కేకలేస్తున్నాడు. నా కెదురుగుండా కూర్చున్న ఆడదికూడా లేచివెళ్లింది.

"రచ్చించండి బాబూ, ఏదో బీదాబిక్కి మీద పగతీరుసుకోకండి బాబయ్యా" అంటున్నాది. కాని టికెట్ కలక్టరు వినిపించుకోలేదు. కోపంతో మండిపోతున్నాడు. కారణం ఏదో వేరే అయి వుంటుంది. టికెట్లు లేకపోతే అంత పెద్ద తగువు కాదు. వాళ్లలో ఎవరేనా అతన్ని ఎదేనా చెడ్డమాట అని వుంటారు, లేదా ఎక్కువ ఆశపెట్టి తక్కువ యిచ్చి వుంటారు. లేకపోతే యీతడు కొత్తవాడు కావడం వల్లనో, మంచివాడు కావడం వల్లనో లంచమంటే అసహ్యం చుకొని వుంటాడు. లేకపోతే అతనికంత కోపమెందుకొస్తుంది?

"కోప మెందుకు బాబయ్యా, పోనీ మరో రెండెక్కువ తీసుకో బాబూ", అన్నాది ఆడది.

"ఛీ లంజముండా, లంచమిస్తావా నాకు" అని కోపంతో ఒళ్లు తెలీకుండా లెంపకాయ కొట్టి, బియ్యమున్న చోట బట్ట పట్టుకులాగేడు. బట్ట కొంచెం జారింది. బియ్యమన్నీ నేలపడి చెదిరిపోయాయి. ఆడవాళ్లు భయంతో గొల్లుమన్నారు. ఇలా జరుగుతుందని ఆడది అనుకోలేదు. కోపంలో ఆవేశంలో యిలా చేశాడు కాని లేకపోతే ఎవ్వరూ యిలా చెయ్యరు. ఆడది వెంటనే భయంతో బిక్క చచ్చిపోయింది. సగం విడిన బట్ట సర్దుకుంది. నలుగురిలో ఎంత అవమానం! నేల చెదిరివున్న బియ్యంవేపు చూసింది. దుఃఖంతో ఆమె కళ్ల నీళ్లు తిరిగేయి. వెంటనే రోషంతో, కోపంతో మతిపోయిన, పగబట్టిన పాములా బుసకొట్టింది, "ఆడదాని బట్టొట్టుకు లాగుతావురా! నీ కప్పచెల్లెళ్లు లేరురా, సేతులెలా వొచ్చినాయిరా, నా కొడకా" అంటూ ఫెడీమని చెంపకేసి కొట్టింది. అప్పటికాతడు ద్వారం దగ్గర నిలుచుని వున్నాడు. తలుపు తీసేవుంది. దెబ్బకు కొంచెం వొగ్గి, మొహం తిరిగి వెనక్కి పడిపోయాడు. ఆడది కెవ్వుమని కేక పెట్టింది. బండిలోవాళ్లు గొల్లుమన్నారు. చీకట్లో వంతెన కింద అడుగున నది నిశ్శబ్దంగా ప్రవహిస్తూంది. నా కాళ్ల దగ్గర చెదిరిన బియ్యపు గింజలు నవ్వుతున్నట్లున్నాయి. ఆహారసమస్య అంటే ఏమిటో అర్థమయింది.

---